సాక్షి తిరుపతి

శనివారం । 31 । మే । 2025



గొంతు కోసిన కత్తి ఏమైంది?

నాయుడుపేట పట్టణంలో జంట ఆత్మహత్యల ఘటన మిస్టరీగా మారింది. దీనిపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. - 10లో



పింఛన్ల కోత..పండుటాకులకు వాత!

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతి నెలా సామాజిక భద్రతా పింఛన్లలో కోత విధిస్తున్నారు. - 10లో



చిరుతల సంచారంపై అధ్యయనం

చిరుతల సంచారంపై టీటీడీ మరోసారి అధ్యయనం చేయనుంది. భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టనుంది. - 10లో

న్యూస్‌రీల్

వర్షాలతో అప్రమత్తం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందస్తుగా వచ్చిన నేపథ్యంలో వర్షాల విషయంలో అధికారులు అప్రత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌ఓపీ) ప్రకారం ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకుని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు రామమోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, డీపీఓ సుశీలాదేవి, ఐసీడీఎస్ పీడీ వసంతబాయ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల టెన్షన్

తిరుపతి అర్బన్: జిల్లాలో ఉద్యోగుల బదిలీల అంశం హాట్ టాపిక్‌గా మారింది. బదిలీల ప్రక్రియ పూర్తి చేయడానికి ఇక రెండు రోజులు మాత్రమే ఉంది. ఈ క్రమంలో పలువురు ఉద్యోగులు స్థానిక ఎమ్మెల్యేల లెటర్లతో విజయవాడకు క్యూకడుతున్నట్లు చర్చసాగుతోంది. బదిలీల నేపథ్యంలో వారం రోజులుగా పలు విభాగాల్లో పాలన కూడా స్తంభించింది. వచ్చే సోమవారం సాయంత్రానికి బదిలీల జాబితా విడుదలవుతుందని ఉద్యోగులు అంటున్నారు. ఏ స్థానంలో ఎవరు ఉంటారో ఏ స్థానం నుంచి ఎవరు బదిలీ అవుతారో తెలియడం లేదు. ఇదిలావుండగా కలెక్టరేట్‌లోని ఓ విభాగం ఇన్‌చార్జిగా పనిచేస్తున్న మహిళా అధికారి తిరుపతి అర్బన్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతుంది. ఆమె గతంలో చంద్రగిరి తహసీల్దార్‌గా పనిచేసిన అనుభవం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేసిన ఓ అధికారి కూడా తిరుపతికి రావడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

కండలేరు ఇన్‌చార్జి ఈఈగా రామచంద్రమూర్తి



రాపూరు: మండలంలోని కండలేరు జలాశయం ఇన్‌చార్జి ఈఈగా రామచంద్రమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు డివిజన్ 2లో ఈఈగా పనిచేస్తూ కండలేరుకు ఇన్‌చార్జి ఈఈగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఈ విజయకుమార్‌రెడ్డికి ఎస్ఈగా పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు జిల్లా గాలేరు-నగిరి సుజల స్రవంతికి బదిలీ చేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. భక్తుల క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 69,019 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 37,774 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.42 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలగుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ట్యాబ్‌లు అందుకున్న రేణిగుంట పాఠశాల విద్యార్థినులు



తిరుపతిలో నాడు-నేడు పనులు ఆగిపోవడంతో అధ్వాన్నంగా శ్రీపద్మావతి బాలికోన్నత పాఠశాల తరగతి గది



చదువుల గుడి.. చతికిలబడి!

గ్రౌండ్ రిపోర్ట్

కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. ఏడాదిగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించకుండా మొండిచేయి చూపుతోంది. పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇంగ్లిషు మీడియం, సీబీఎస్ఈ, ఐబీ(ఇంటర్నేషనల్ బేసిక్ కరికులమ్)కు మంగళం పాడేసింది. డ్రాపౌట్స్‌ను నివారించి, పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించే లక్ష్యంతో అందించిన సంక్షేమ పథకాలను అటకెక్కించింది. ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి ఇచ్చిన హామీలను గాలికొదిలేసింది. కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలకు పెద్ద పీట వేస్తోంది. గత ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం చేసిన మేలుని.. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో విద్యారంగానికి చేసిన కీడుని తల్లిదండ్రులు గుర్తుచేసుకుంటున్నారు. కూటమి ఏడాది పాలనపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

– తిరుపతి సిటీ

- ఏడాదిగా ప్రభుత్వ విద్యావ్యవస్థ సర్వనాశనం
- పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తం
- ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించలేక పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం
- కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలకు పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం
- నాడు పేదలకు కార్పొరేట్ విద్యనందించిన జగనన్న సర్కార్
- ఐబీ, సీబీఎస్ఈ సిలబస్‌తో వినూత్న సంస్కరణలు
- గుర్తుచేసుకుంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

- తిరుపతి జీవకోనకు చెందిన సుబ్రమణ్యంకు ముగ్గురు పిల్లలు. ఒకరు 8వ తరగతి చదువుతుండగా.. రెండో అమ్మాయి 10వ తరగతి, మరో అమ్మాయి పది పాసై ఇంటర్ చేరేందుకు ప్రయత్నిస్తోంది. తల్లి అనారోగ్యంతో మంచం పట్టింది. గతంలో అమ్మ ఒడి ఒక విద్యార్థికి ఐదేళ్లపాటు రూ.75 వేలు తల్లిఖాతాలో జమకావడంతో పిల్లల చదువులకు పెద్దగా ఇబ్బంది లేకుండా పోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం కింద ముగ్గురు పిల్లలకు రూ.45 వేలుదాకా అందాల్సి ఉంది. 2025కు మరో రూ.45 వేలు మంజూరు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు పైసా విదల్చలేదు.

- వెంకటగిరికి చెందిన చంద్రయ్య రైతు కూలీ. ఆయన కుమారుడు తిరుపతి పట్టణంలోని ఓ ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. 2024లో ఫీజురీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో థర్డ్ ఇయర్ 6వ సెమిస్టర్ పరీక్షలకు హాల్‌టికెట్ ఇచ్చేందుకు కళాశాల యాజమాన్యం నిరాకరించింది. దీంతో మూడు విడతల బకాయి సుమారు రూ.80వేలు అప్పు చేసి ఫీజు చెల్లించాల్సి వచ్చింది. ఈ ఏడాది సైతం ఫీజురీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో ఏం చేయాలో తెలియక ఎన్‌జీఓల చుట్టూ తిరుగుతున్నాడు.



నరసింగాపురంలో ఆగిపోయిన నాడు-నేడు పనులు

తిరుపతి జిల్లా సమాచారం

విద్యాసంస్థలు	సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక పాఠశాలలు	1,817	47,998
ప్రాథమికోన్నత	194	15,897
ఉన్నత	323	76,345
ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు	878	85,780
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	22	21,570
ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు	118	65,800
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	18	43,907
ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	104	72,459

నాడు- నేడుతో అభివృద్ధి చేసిన పాఠశాలలు **1,021**

ఖర్చు చేసిన మొత్తం రూ. **574.11** కోట్లు

జగనన్న పాలనలో ప్రభుత్వ విద్యకు అందలం

పేదరికం చదువులకు అడ్డు రాకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. జిల్లాలో ప్రతి ఏటా 2.57లక్షల మందికి అమ్మఒడి ద్వారా పది, ఇంటర్ చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాలో ఏడాదికి రూ.14వేలు చొప్పున నగదు జమచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించాలనే ఉద్దేశంతో బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకుని సుమారు 1.13 లక్షల మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఐబీ (ఇంటర్నేషనల్ బేసిక్ కరికులమ్) సిలబస్‌తో అంతర్జాతీయ స్థాయి విద్యనందించారు. ప్రపంచంతో పోటీ పడేలా సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టారు. ఇంగ్లిష్ మీడియాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. నాడు-నేడు పథకం ద్వారా జిల్లాలోని 1,021 ప్రభుత్వ పాఠశాలలను రూ.574కోట్లతో అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దారు. ప్రతి ఏడాదీ పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఘనంగా సత్కరించి ప్రోత్సాహకాలను అందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విదేశీ పర్యటన పేరుతో అమెరికా వైట్‌హౌజ్, ఐక్యరాజ్య సమతి సభలో ప్రసంగించే అవకాశాన్ని కల్పించారు. పేద విద్యార్థులు ఇంటర్‌తోనే చదువు



పిచ్చాటూరు: కళకళలాడుతున్న ఓబులరాజుకండ్రిగ పాఠశాల

ఆపేయకుండా డిగ్రీ వైపు ప్రోత్సహించి ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో యూజీ చదువుతున్న అర్హులైన ప్రతి విద్యార్థికీ విద్యాదీవెన పేరుతో ప్రతి ఏడాదీ ఫీజురీయింబర్స్‌మెంట్ అందించారు. గతంలో చంద్రబాబు సర్కార్ బకాయిలు పెట్టిన సుమారు రూ.245 కోట్ల ఫీజురీయింబర్స్ మెంట్‌ను సైతం 2019లో అధికారం చేపట్టిన మూడు నెలలకే చెల్లించారు. దీంతో పాటు అర్హులైన ప్రతి యూజీ విద్యార్థికి వసతి దీవెన కింద రూ.648కోట్ల మేర అందించారు. విద్యారుణాలు జిల్లాలో 1,870 మందికి రూ.56 కోట్లకుపైగా అందించారు. విదేశీ విద్యను ప్రోత్సహించారు. ఇందు కోసం రూ.252.27 కోట్లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో గోరు ముద్ద పేరుతో రుచికరమైన పోషకాహారం అందిస్తూ విద్యార్థులను ఆకట్టుకున్నారు.

మా ఊరి బడి బాగుపడింది



మా గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. అసౌకర్యాల నడుమ పాఠశాల కొనసాగుతూ ఉండేది. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో మా ఊరు బడి బాగుపడింది. **–నాగరాజు, కంచరపాళెం, వరదయ్యపాళెం మండలం**

ప్రతి ఏడాదీ అమ్మఒడి అందింది



జగనన్న పాలనలో అమ్మ ఒడి రూ.56వేలు అందింది. మా అమ్మాయి ఏడో తరగతి చదువుతున్నప్పటి నుంచి క్రమంతప్పకుండా అమ్మఒడి అందింది. మా పెద్ద అమ్మాయి మెడిసిన్ కోసం వసతి దీవెన కింద ఏడాదికి రూ.12 వేలు పడ్డాయి.

–ప్రమీలమ్మ, గృహిణి, తిరుపతి

పేదలకు కార్పొరేట్ విద్య



జగనన్న పాలనలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యాసంస్థలుగా మారాయి. పేదలకు అంతర్జాతీయ స్థాయి విద్య అందింది. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల దశ దిశ మారింది. ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన లక్షల్లో విద్యార్థులు అందించారు. పేదల పాలిట దేవుడు జగనన్న.

–సావిత్రమ్మ, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు, తిరుపతి

బాబు పాలనలో ప్రభుత్వ విద్య నిర్వీర్యం

కూటమి ప్రభుత్వం పాఠశాలలను పూర్తిగా నిర్వీర్యం చేస్తోంది. పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే ప్రయత్నం చేస్తోంది. కార్పొరేట్ సంస్థలకు విద్యను అమ్మేసేందుకు సిద్ధమైంది. 2024 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాలోని సుమారు లక్ష మంది విద్యార్థులకు రూ.235 కోట్ల మేర ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా మొండిచెయ్యి చూపుతోంది. విధిలేని పరిస్థితుల్లో కొందరు మధ్యలోనే విద్యనాపేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అమ్మ ఒడి, వసతి దీవెన, విదేశీ విద్య పథకాలకు మంగళం పాడేసింది. చంద్రబాబు ఎన్నికల హామీల్లో భాగంగా కుటుంబంలో ఎంతమంది ఉంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం పేరుతో ఏడాదికి రూ.15వేలు నగదు అందిస్తామని చెప్పి ఇంత వరకు పైసా అందించకుండా వేధిస్తోంది. జిల్లాలోని 5.65 లక్షల మంది విద్యార్థులకు 2024 విద్యాసంవత్సరంలో రూ.847,50 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా నిర్మించ తలపెట్టిన సుమారు 47పాఠశాలల భవనాలను పూర్తి చేయకుండా మొండికేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని పూర్తిగా మార్చేసింది. పౌష్టికాహారానికి మంగళం పాడేసి నాసిరకం ఆహారాన్ని అందిస్తోంది. సీబీఎస్ఈ



చంద్రగిరిలో అసంపూర్తిగా నాడు-నేడు పనులు



మంగళం ట్రెండ్స్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇదీ పరిస్థితి

సిలబస్‌ను నిర్వీర్యయం చేసే ప్రయత్నం చేస్తూ, ఐబీ సిలబస్‌ను ఎత్తివేసే కుట్రకు తెరలేపింది.

పిల్లల చదువులు ప్రశ్నార్థకం



కూటమి ప్రభుత్వం వచ్చాక అమ్మఒడి ఆపేశారు. తల్లికి వందనం ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదు. మళ్లీ కొత్తగా పాఠశాలలు ప్రారంభమవుతున్నాయి. చిల్లిగవ్వ చేతిలో లేదు. మేము ఇళ్లల్లో కూలి పని చేసి పిల్లలను చదివించుకుంటున్నాం. మా అమ్మాయి 9వ తరగతి పూర్తి చేసుకుని 10కి వెళ్తోంది. ఇంకో అమ్మాయి డిగ్రీ చేరుతుంది. ఫీజులు ఎలా కట్టాలో అర్థం కావడం లేదు. రెండేళ్లకు సంబంధించి తల్లికి వందనం రూ.30వేలు బాబు సర్కార్ ఇవ్వాలి.

–చంద్రమ్మ, దినసరి కూలీ, తిరుపతి రూరల్

ఏమి చేయాలో తెలియడం లేదు



మేము భవన నిర్మాణ కూలీలం. భార్యాభర్త ఇద్దరం కూలికి పోతాం. ప్రతి రోజూ పని దొరకదు. మాకు ముగ్గురు పిల్లలు. అమ్మాయి డిగ్రీ చదువుతోంది. అబ్బాయి ఇంటర్. మరో అమ్మాయి 9వ తరగతి. ముగ్గురు పిల్లలు చేతికష్టం పెట్టి చదివించాలంటే భారంగా ఉంది. మా లాగా కష్టం చేయకూడదని చదివిస్తున్నాం. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు పథకాలు ఇవ్వడం లేదు. స్కాలర్ షిప్‌లు కూడా రావడం లేదు.

–ప్రభాకర్, భవన నిర్మాణ కార్మికుడు, రేణిగుంట

గత ప్రభుత్వంలో విద్యరంగానికి అందించిన పథకాలు

పథకం	లబ్ధిదారుల సంఖ్య (లక్షల్లో)	మొత్తం (కోట్లలో)
అమ్మ ఒడి	2.57	1799.76
విద్యాదీవెన	1.10	1650.09
వసతి దీవెన	1.08	648.18
విదేశీ విద్యాదీవెన	126	252.12
స్కాలర్ షిప్‌లు	0.90	163.01
విద్యారుణాలు	0.39	56.79
జగనన్న విద్యాకానుక	5.98	3401.89
ట్యాబ్‌లు	1.19	536.06

కూడమి ఏడాది పాలనలో అందాల్సిన బకాయిలు

పథకం	లబ్ధిదారుల సంఖ్య (లక్షల్లో)	మొత్తం (కోట్లలో)	ఇప్పటి వరకు అందినవి
తల్లికి వందనం	5.65	847.50	జీరో
విద్యాదీవెన	2.67	934.75	జీరో
ఫీజు బకాయిలు	1.30	235.98	45.03
వసతి దీవెన	1.90	228.01	జీరో
విదేశీ విద్యాదీవెన	287	458.02	జీరో
స్కాలర్ షిప్‌లు	1.97	237.12	జీరో
విద్యారుణాలు	1.11	98.16	జీరో
జగనన్న విద్యాకానుక	2.01	276.61	జీరో
ట్యాబ్‌లు	0.65	97.50	జీరో

డ్రగ్స్ నిర్మూలనపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ

తిరుపతి అర్బన్: అవగాహనతోనే డ్రగ్స్‌ను నిర్మూలించొచ్చని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డ్రగ్స్ నిర్మూలపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఆర్వో నరసింహులుతో కలసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ఫలితాలను యువతకు వివరించాలని సూచించారు. విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌లు, డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. వారం రోజుల్లోగా డీ అడిక్షన్ సెంటర్‌ను పూర్తి స్థాయిలో వసతులు కల్పించి, వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. ఫిర్యాదులు చేసేందుకు ఏర్పాటు చేసిన 1972 టోల్ ఫ్రీ నంబర్‌పై సరైన ప్రచారం కల్పించాలన్నారు. అనంతరం మాదక ద్రావ్యాల నిషేధంపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఆర్డీవోలు రామమోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, డీఈవో కేవీఎన్ కుమార్, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, ఆర్టీవో మురళీమోహన్, ఆర్టీసీ ఏటీఎం డీఆర్ నాయుడు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వాసుదేవచౌదరి, రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, డ్రగ్స్ అధికారులు పాల్గొన్నారు

పోలీసుల తీరుపై ఆర్డీఓ అసహనం



అసహనం వ్యక్తం చేస్తున్న ఆర్డీఓ పావని

కలువాయి(సైదాపురం): కలువాయి తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో రెవెన్యూ సమస్యలపై వినతిపత్రాలు అందించేందుకు అర్జీదారులు పోటెత్తారు. అయితే అర్జీదారులను నియంత్రించడానికి ఒక్క పోలీసు మాత్రమే వచ్చారు. ఆయన అర్జీదారులను కట్టడి చేయలేకపోవడంతో ఆర్డీఓ పావని పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. 'మీకు లెటర్ పెట్టాం కదా ?' అని పోలీసులను అడగ్గా.. సిబ్బంది తక్కువగా ఉన్నారని సమాధానం చెప్పారు. అయితే కొందరు అర్జీదారుల మధ్య పొలం, దారి సమస్యలపై గొడవలు జరగడం.. వారిని పోలీసులు నిలువరించలేకపోవడంతో ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గిరిజనులకు అవగాహన కల్పించండి

తిరుపతి అర్బన్: ధర్తీ ఆబాజన్ జాతీయ గ్రామఉత్కర్ష అభియాన్ పథకం ద్వారా గిరిజనుల సాధికారత, ఆర్థిక, సామాజికాభివృద్ధికి గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

డక్కిలి: మండలంలోని దగ్గవోలు గ్రామానికి చెందిన బోనుబోయిన వెంకటసుబ్బయ్య (55) గురువారం పూటుగా మద్యం సేవించి మద్యం మత్తులో గడ్డి మందు సేవించాడు. బంధువులు గూడూరులోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శుక్రవారం ఉదయం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ శశిశంకర్ తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎన్‌ఎస్‌యూ డీఈ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ దూర విద్యాకేంద్రం ఆధ్వర్యంలో పలు కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.రంగనాథన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా సంస్కృతంలో ఆరు నెలల వ్యవధి సర్టిఫికెట్ కోర్సు, ఏడాది వ్యవధి డిప్లొమో, రెండు సంవత్సరాల వ్యవధి పాక్‌శాస్త్రి కోర్సులు ఉన్నాయని తెలియజేశారు. ఈ కోర్సులకు ఆసక్తిగల వారు వచ్చేనెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440626562 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఏసీ శ్రీనివాసులురెడ్డికి నగదు అందిస్తున్న దాత శంకర్‌రావు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం వైఎస్సార్ జిల్లా బద్వేల్‌కు చెందిన గాజులపల్లి శంకర్‌రావు, ధర్మపత్ని శ్రీదేవి రూ.లక్ష విరాళంగా అందించినట్లు ఆలయ ఏసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. దాతకు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాలు అందించినట్లు ఆయన తెలిపారు.

టమాట లారీ బోల్తా

నాయుడుపేట టౌన్ : పట్టణ పరిధిలోని గోమతి సర్కిల్ సమీపంలో జాతీయ రహదారిపై టమాట లోడ్తుతో వెళుతున్న మినీ లారీ శుక్రవారం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్లకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లి నుంచి నెల్లూరుకు మినీ లారీలో టమాటాలు తీసుకెళ్తున్నారు. మార్గమధ్యంలో నాయుడుపేట సమీపంలోని జాతీయ రహదారిపై ముందు వెళుతున్న వాహనాన్ని అదిగమించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కగా పొలాల్లోకి వెళ్లి లారీ బోల్తా పడింది. క్షతగాత్రులను శ్రీకాళహస్తికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

దళిత బాలికపై అత్యాచార యత్నం

నిందితుడిపై పోక్సో కేసు

రేణిగుంట: దళిత బాలికపై అత్యాచార యత్నానికి ఒడిగట్టిన కామాంధుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలు. రేణిగుంట మండలం, కరకంబాడికి చెందిన ప్రసన్నకుమార్(38) అదే ప్రాంతంలో ఓ హోటల్ వద్ద ఉన్న దళిత బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సోతో పాటు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ జయచంద్ర తెలిపారు.

చిరుతల సంచారంపై మరోసారి అధ్యయనం

- గతంలో తీసుకున్న నిర్ణయాలే ఆధారం
- తిరుమల అటవీ ప్రాంతంలో అధ్యయనం చేయనున్న సైంటిస్ట్ రమేష్

తిరుమల: చిరుతల సంచారంపై టీటీడీ మరోసారి అధ్యయనం చేయనుంది. గత ప్రభుత్వ హయాంలో అధికారులు తీసుకున్న నిర్ణయాలను ప్రస్తుత టీటీడీ అధికారులు తిరిగి అమలు చేయనున్నారు. గతంలో ఘాట్ రోడ్లో, నడక మార్గంలో వన్యమృగాలను కట్టడి చేసేందుకు అప్పటి ఈవో ధర్మారెడ్డి, చైర్మన్ కరుణాకరరెడ్డి సైంటిస్ట్ రమేష్ కమిటీని పిలిపించి అధ్యయనం చేయించారు. ప్రభుత్వం మారడంతో ఆ కమిటీ అధ్యయనం మూలన పడింది. అయితే తిరిగి చిరుతల సంచారం పెరగడంతో గతంలో తీసుకున్న నిర్ణయాలను పునఃపరిశీలించనుంది.

ఎట్టకేలకు నిద్ర లేచింది

నడక మార్గంలో భక్తుల భద్రతపై టీటీడీ అటవీశాఖ దృష్టి సారించింది. డెహ్రాడూన్‌కు చెందిన వైల్డ్ లైఫ్ సైంటిస్ట్ రమేష్ సూచనలను అమలు చేయడానికి సిద్ధమవుతోంది. కాకపోతే ఇది కూడా తమ హయాంలోనే జరిగిందని కలరింగ్ ఇచ్చుకోవడానికి రమేష్‌ను మరోసారి వర్క్‌షాప్ నిర్వహించి నివేదికను టీటీడీకి అందజేసేందుకు పథకం వేసింది.



26న మొదటి ఘాట్ రోడ్ రక్షణ గోడపై చిరుత

గతంలోనే పకడ్బందీ చర్యలు

అలిపిరి నడక మార్గంలో 2023 జూన్ 24న ఏడో మైలు వద్ద మూడేళ్ల బాలుడు కౌశిక్ పై చిరుత దాడి చేయగా అదే ఏడాది ఆగస్టు ఎనిమిదో తేదీన నరసింహస్వామి ఆలయం వద్ద ఆరేళ్ల బాలికపై దాడి చేసి చంపేసింది. దీంతో టీటీడీ యంత్రాంగం అప్రమత్తమైంది. భక్తుల భద్రతపై దృష్టి సారించిన అప్పటి ఈవో ధర్మారెడ్డి, చైర్మన్ కరుణాకరరెడ్డి సూచనలతో అటవీశాఖ అధికారులు పలు చర్యలు చేపట్టారు. అలిపిరి నడక మార్గంలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి 12 ఏళ్ల లోపు చిన్నారులను అనుమతించకుండా నిలిపివేయడం, సాయంత్రం ఆరు నుంచి ఏడో మైలు నుంచి నరసింహస్వామి ఆలయం వరకు భద్రతా సిబ్బంది గస్తీ మధ్య భక్తులను గుంపులుగా అనుమతించడం వంటి చర్యలు చేపట్టారు. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో 250 ట్రాప్ కెమెరాల్ని ఏర్పాటు చేశారు. వాటి ఆధారంగా జూన్ నుంచి డిసెంబర్ వరకు ఆరు చిరుతలను గుర్తించారు. వన్యప్రాణుల సంచారంపై నిఘా ఉంచడానికి ఏడో మైలు వద్ద అటవీశాఖ అధికారులు, టీటీడీ విజిలెన్స్ సంయుక్తంగా బేస్ క్యాంపును ఏర్పాటు చేశారు. అటువైపు ఉన్న జింకలను ఇతర ప్రాంతాలకు మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. నడకదారి భక్తులకు మనోధైర్యం కల్పించేందుకు ఊతకర్రలను అందించారు. డెహ్రాడూన్‌కు చెందిన వైల్డ్ లైఫ్ సైంటిస్ట్ రమేష్ నేతృత్వంలో చిరుతల సంచారానికి గల కారణాలపై చర్చించారు. వారి నివేదిక సమర్పించే సమయానికి ప్రభుత్వం మారింది. మరోవైపు అప్పటి అధికారులు తీసుకున్న చర్యలతో చిరుతల సంచారం కూడా తగ్గిపోవడంతో సైంటిస్ట్ నివేదికను టీటీడీ లైట్ తీసుకుంది.

మళ్లీ కలకలం

ఈనెల 25వ తేదీన అలిపిరి నడక మార్గంలో 350 మెట్టు వద్ద చిరుత సంచరించడం, అనంతరం మరుటి రోజు మొదటి ఘాట్ రోడ్డులోని వినాయక స్వామి ఆలయం వద్ద వాహనదారులకు సమీపం నుంచి చిరుత వెళ్లడంతో టీటీడీ ఉలిక్కిపడింది. రెండేళ్ల క్రితం ఇదే సమయంలో చిరుత సంచారం కారణంగా ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఈసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు ప్రారంభించింది. గతంలో సైంటిస్ట్ రమేష్ ఇచ్చిన నివేదికను మరోసారి టీటీడీకి అందజేయించేందుకు ఆయనతో వర్చువల్‌గా సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు శనివారం ఆయన తిరుమలకు చేరుకుని జూన్ 1, 2 తేదీలలో వర్క్‌షాప్ నిర్వహించి టీటీడీకి నివేదికను సమర్పించేలా అధికారులు ప్లాన్ చేశారు. భద్రతా ఏర్పాట్లను తిరిగి పునఃప్రారంభించేలా టీటీడీ చర్యలు తీసుకుంది.

చెన్నైలో వలస కార్మికుడి మృతి



మృతుడు యేసు

రేణిగుంట: పొట్టకూటి కోసం చెన్నైకి వలసవెళ్లి తాపీ మేస్త్రిగా పనిచేస్తున్న సమయంలో పిట్స్ రావడంతో తోటి కార్మికులు హాస్పిటల్లో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. గతంలో రేణిగుంటలో పనిచేసినట్లు తెలపడంతో గత వారం రోజులుగా రేణిగుంట పరిసర ప్రాంతాల్లో సహచర కూలీలు మృతుడి ఫొటో పట్టుకొని వెతుకుతున్నారు. రేణిగుంటలో శుక్రవారం మేస్త్రి నారయ్య మాట్లాడుతూ తనతోపాటు కొంతమంది కార్మికులను చెన్నైకి పనికి తీసుకొని వెళ్లే వాడినన్నారు. ఆ క్రమంలో రేణిగుంటలో యేసు అనే కార్మికుడు 20 రోజుల క్రితం పని కోసం తమతోపాటు చెన్నైకి వచ్చాడని, పది రోజులు పనిచేసి కూలీ డబ్బులు తీసుకొని తిరుగు ప్రయాణమయ్యే సమయంలో అతనికి పిట్స్ వచ్చాయని తెలిపారు. సమీపంలోని ప్రభుత్వ కేఎంసీ హాస్పిటల్‌కు తరలించకగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు వస్తేనే మృతదేహం ఇస్తామని హాస్పిటల్ వారు తెలిపారని, ఎవరికైనా మృతుడి ఆచూకీ తెలిస్తే 9550349981, 7989245532 నంబర్లలో సంప్రదించాలని మేస్త్రీ కోరుతున్నారు.

పింఛన్ల కోత.. పండుటాకులకు వాత!

- గ్రీవెన్స్ చుట్టూ తిరుగుతున్న వితంతువులు

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కొత్త పింఛన్లకు మంగళం పాడేసింది. గత ఏడాది జూన్‌లో ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లు జిల్లాలో 2,71,183 మందికి అందించగా.. ఈ ఏడాది జూన్‌లో 2,60,379 మందికి మాత్రమే పింఛన్లు మంజూరు చేశారు. కూటమి ఏడాది పాలనలో జిల్లాలో 10,804 పింఛన్లు తగ్గించారు. ప్రతి నెలా వెయ్యి పింఛన్లు తగ్గిస్తున్నారు. ఈ అంశంపై అధికారులను ప్రశ్నిస్తే...పింఛన్లు తగ్గించలేదని వారంతా మృతి చెందారని సమాధానం ఇస్తున్నారు. తొలగించిన వారి జాబితా ఇవ్వడానికి అధికారులు విముఖత చూపుతున్నారు.

నేడు, రేపు పింఛన్ల తనిఖీల జాబితా విడుదల

కూటమి ఏడాది పాలనలో 10,804 మందికి పింఛన్లు తగ్గించారు. మరోవైపు జిల్లాలో గత ఆరు నెలలుగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులను తనిఖీలు చేసిన సంగతి తెలిసిందే. వీరి జాబితాను త్వరలో విడుదల చేస్తామని చెబుతున్నారు. ఈ జాబితా వస్తే అందులో ఎంత మందిని తొలగిస్తారో తెలియని పరిస్థితి. మరోవైపు రూ.4 వేలు ఫించన్ తీసుకుంటున్న వారిని జూన్ రెండో వారం నుంచి తనిఖీలు చేయనున్నారు.

స్పౌజ్ పింఛన్లకు కొత్త మెలిక

స్పౌజ్ కేటగిరిలో వితంతువులకు పింఛన్లు ఇవ్వాల్సి ఉంది. అయితే ప్రభుత్వం 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 వరకు ఏ కేటగిరిలోనైనా పింఛన్లు తీసుకుంటున్న భర్త మృతి చెందితే మాత్రమే వారి సతీమణులకు పింఛన్లు ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. ఆ మేరకు 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 వరకు మృతి చెందిన పింఛన్‌దారుల భార్యలకు 3,940 పింఛన్లు మంజూరు చేశారు. వాటిని వెరిఫికేషన్ చేస్తున్నారు. అందులో 1,500 పింఛన్లు సర్వర్ సమస్యలతో గుర్తించలేకపోతున్నామని చెబుతున్నారు. జిల్లాలో 2023 డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు వితంతువులై పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారు 6,500 మందికి పైగా ఉన్నట్లు అధికారుల వద్ద లెక్కలున్నాయి.



వితంతు పింఛన్ కోసం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అభాగ్యులు (ఫైల్)

తగ్గిపోతున్న పింఛన్లు

గత ఏడాది	తగ్గించిన పింఛన్లు	ఈ ఏడాది	తగ్గించిన పింఛన్లు
జూలై	2,021	జనవరి	641
ఆగస్టు	1,390	ఫిబ్రవరి	804
సెప్టెంబర్	683	మార్చి	730
అక్టోబర్	747	ఏప్రిల్	620
నవంబర్	854	మే	611
డిసెంబర్	852	జూన్	851

12 నెలల్లో-10,804 పింఛన్ల కోత

50 ఏళ్లకే పింఛన్ ఎక్కడా?

జిల్లాలో ప్రస్తుతం జూన్‌లో 2,60,379 మందికి పింఛన్లు ఇవ్వనున్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటి వరకు ఆ ఊసేలేదు. 50 ఏళ్లు పైబడి పింఛన్లకు అర్హులైన వారు జిల్లాలో 70 వేల మందికి పైగానే ఉన్నారు. మరోవైపు 60 ఏళ్లు దాటి పింఛన్లకు అర్హులైన వారు, వితంతువులు, కళాకారులు, అనారోగ్యంతో బాధపడుతున్న వివిధ వ్యాధిగ్రస్తులు మరో 30 వేల మంది వరకు ఉన్నారు. మొత్తంగా జిల్లాలో కొత్తగా లక్ష మందికి పింఛన్లు ఇవ్వాల్సి ఉంది.

పింఛన్లు తొలగించలేదు



ఏడాది కాలంలో పింఛన్లు మేము తొలగించలేదు. అందులో చాలా మంది మృతి చెందారు. పలువురు వరుసగా మూడు నెలలు పింఛన్లు తీసుకోలేదు. దీంతోనే ఆ పింఛన్లు తగ్గాయి. మే నెలకు సంబంధించి పింఛన్లు 2,60,379 మందికి ఈ నెల 31 నుంచి అందిస్తాం.

–టీఎస్ శోభన్‌బాబు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్

గొంతు కోసిన కత్తి ఏమైంది?

- జంట ఆత్మహత్యలపై అనుమానాలెన్నో
- మృతుల సెల్ ఫోన్లు ఏమయ్యాయి ?
- లాడ్జీలో సీసీకెమెరాలు ఎందుకు ఆపేశారు?
- విచారిస్తున్న పోలీసులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న లాడ్జీలో జంట ఆత్మహత్య ఘటన మిస్టరీగా మారింది. లాడ్జీలో కొన్ని గంటల పాటు సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, మృతుడి గొంతు కోసిన కత్తి కనిపించకపోవడం.. మృతుల సెల్ ఫోన్లు ఎక్కడున్నాయో తెలియక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. వారి కథనం మేరకు.. దొరవారిసత్రం మండలం, ఏకొల్లు పంచాయతీ, కుప్పారెడ్డిపాళెం గ్రామానికి చెందిన జమ్మల సుబ్రహ్మణ్యం, అలియాస్ మణి, అదే గ్రామానికి చెందిన బొడిపెద్ద శీరిష వివాహేతర సంబంధం పెట్టుకుని ఇద్దరూ నాయుడుపేట పట్టణంలోని ఓలాడ్జీలో గురువారం అనుమానాస్పదంగా మృతి చెందారు. ఈ ఘటనపై మణి తల్లి జమ్మల లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ బాబి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మణి గొంతుపై కత్తితో కోసిన గాట్లు ఉండడం, అతని మృతదేహంపై నుంచే కుర్చీ వేసుకుని చున్నీతో శిరిష ఉరేసుకుని మృతి చెంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా గొంతు కొసుకునేందుకు వినియోగించిన కత్తి లాడ్జీ గదిలో ఎక్కడా లభించలేదు. మృతులు మణి, శిరిష సెల్ ఫోన్లు సైతం లేకపోవడం మిస్టరీగా మారింది. మణి, శిరిష మధ్య ఏదైనా గొడవ జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. శిరిష పథకం ప్రకారమే మణికి అతిగా మద్యం తాగించి కత్తితో గొంతు కొసి హతమార్చి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. తర్వాత ఆమె కూడా గదిలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అంతేకాకుండా లాడ్జీ సిబ్బంది వ్యవహార శైలిపై కూడా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. లాడ్జీలో సీసీ కెమెరాలు కొన్ని గంటల పాటు పనిచేయకపోవడంపై విచారిస్తున్నారు. మృతులు ఇద్దరూ నాయుడుపేట లాడ్జీలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం 9 గంటల వరకు పలుమార్లు రిసెప్షన్ వద్దకు రావడం గుర్తించారు. శిరీష లాడ్జీ కిందకు వచ్చి పలువురితో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అన్ని కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు మణి, శిరీష మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.



నాయుడుపేట ప్రభుత్వాస్పత్రి వద్ద గుమికూడిన మృతుల బంధువులు

భార్యపై కక్ష పెంచుకుని హత్య

నాయుడుపేట టౌన్: భార్యపై కక్షతోనే భర్త రాయితో కొట్టి గొంతు నూలిమి హత్య చేసినట్లు సీఐ బాబి వెల్లడించారు. హత్య కేసులో నిందితుడైన మానికల శ్రీనివాసులును శుక్రవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిందితుడిని హాజరుపరిచి సీఐ వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని మడపలం గ్రామ సమీపంలో కాలువ గట్టు వద్ద శ్రీనివాసులు, భార్య వీణమ్మ(28), ముగ్గురు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారని తెలిపారు. భర్త ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్టు భార్య అనుమానంతో నిత్యం వేధించేది. దీంతో శ్రీనివాసులు భార్యపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఈనెల 17వ తేదీ రాత్రి భార్య, భర్తలిద్దరూ కలిసి మద్యం సేవించారు. ఆ సమయంలో వీరి మధ్య వివాదం రేగింది. శ్రీనివాసులు ఇదే అదనుగా అక్కడే ఉన్న రాయితో భార్యపై దాడి చేసి హత్య చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న సీఐతో పాటు ఎస్ఐ ఆదిలక్ష్మి, పోలీసులు అన్ను దయాకర్, పోలయ్య, వెంకీలను డీఎస్పీ చెంచుబాబు అభినందించినట్లు తెలిపారు.



నిందితుడు శ్రీనివాసులును అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి

ఎస్సీ, ఎస్టీ కాలనీ దారి ఆక్రమణ

గూడూరు రూరల్: మండలంలోని నెర్నూరు గ్రామం ఎస్టీ కాలనీ నుంచి ఎస్సీ కాలనీకి వెళ్తున్న దారిని అగ్రకులానికి చెందిన మోటుపల్లిబాబు ఆక్రమించాడు. దీంతో శుక్రవారం గ్రామస్తులకు బాబు వ్యవసాయ పొలంలో పనిచేస్తున్న కాపాలదారుడికి మధ్య గొడవ జరిగింది. దళితల కథనం మేరకు.. దారికి అడ్డంగా రాళ్లు నాటడంతో దళితులు వచ్చి అడ్డుకున్నారు. గూడూరు రూరల్ పోలీసులు రంగప్రవేశం చేసి సర్దిపెట్టారు. రెవెన్యూశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే దారి ఆక్రమించారని గ్రామస్తులు ఆరోపించారు.

సేవాసదన్ సమీపంలో పాము



పాముతో భాస్కర్ నాయుడు

తిరుమల : తిరుమల సేవాసదన్ సమీపంలోని పార్కులో శుక్రవారం 7 అడుగుల జెర్రిపోతు కనిపించడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ భాస్కర్ నాయుడు అక్కడకు చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

తిరుపతి ఎంపీ 'వెలుగులు'

- 22 గ్రామ పంచాయతీలకు రూ.21.20 లక్షలతో వీధిలైట్లు



సర్పంచ్‌లకు వీధిలైట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వరదయ్యపాళెం: మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి తన నిధుల ద్వారా వీధిలైట్ల పంపిణీకి చొరవ చూపారు. ఆ మేరకు మండలంలోని 22 పంచాయతీలకు సంబంధించి రాచర్ల, కంచరపాళెం, అరుదూరు, యానాదివెట్టు, కడూరు, తొండంబట్టు, పులివల్లం, మత్తేరిమిట్ట, వరదయ్యపాళెం, కాంబాకం, కురింజల్లం, ముస్లింపాళెం, ఇందిరానగర్, సీఎల్ఎన్‌పల్లి, కళత్తూరు, అంబూరు, సంతవేలూరు, నెల్లటూరు, గూడలవారిపాళెం, అయ్యవారిపాళెం, మావిళ్లపాడు, వరదయ్యపాళెం గ్రామ పంచాయతీలకు రూ. 21.2 లక్షలతో వీధిలైట్లను పంపిణీ చేశారు. ఆ మేరకు శుక్రవారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నాయుడుదయాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, రాష్ట్ర చేనేత కార్మిక విభాగం సభ్యులు బొప్పన తిలక్‌బాబు చేతుల మీదుగా కాంట్రాక్టర్ రమణయ్య సర్పంచులకు వీధిలైట్లను అందజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ మాట్లాడుతూ.. పంచాయతీల్లో విద్యుత్ దీపాల పంపిణీకి చొరవ చూపిన ఎంపీ గురుమూర్తికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ దుడ్డు వేణు, నియోజకవర్గ యూత్ కన్వీనర్ వినోద్‌యాదవ్, మండల సేవాదళ్ కన్వీనర్ నానిరెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ సునీల్, నాయకులు రమేష్, మురళీరెడ్డి, రిపువర్ధన్ పాల్గొన్నారు.

భర్తపై కేసు

కేవీబీపురం: భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని కాళంగి పంచాయతీ హనుమయ్య కండ్రిగ గ్రామానికి చెందిన ఎం.సుబ్రమణ్యం, స్వాతి భార్యాభర్తలు. వీరికి 15 ఏళ్ల క్రితం వివాహమైంది. ముగ్గురు పిల్లలు ఉన్నారు. సుబ్రమణ్యం తాగుడుకు బానిసై కొంతకాలంగా భార్యను చిత్ర హింసలకు గురిచేసేవాడు. ఈనెల 28వ తేదీన తాగి వచ్చి భార్య స్వాతిని తీవ్రంగా కొట్టి మెడమీద కాలుపెట్టి తొక్కి చంపేందుకు ప్రయత్నించాడు. ఆమెను హుటాహుటిన శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్వాతి శుక్రవారం ఫిర్యాదు చేయడంతో భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధిపై టీటీడీ ఈఓ సమీక్ష

తిరుమల : తిరుమలలోని ఆకాశగంగ, పాపవినాశనం, సీఆర్‌ఓ కార్యాలయం వద్ద అభివద్ధి పనులపై టీటీడీ ఈఓ జె.శ్యామలరావు శుక్రవారం అన్నమయ్య భవన్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా నిపుణులు తాము రూపొందించిన ప్రణాళికలను వివరించారు. ఈఓ మాట్లాడుతూ భవిష్యత్ అవసరాల మేరకు అభివృద్ధి చేయాలని సూచించారు. సీఆర్‌ఓ కార్యాలయం వద్ద భక్తులకు ఆధునిక వసతులు కల్పించాలని కోరారు. అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, సీఈ సత్యనారాయణ, డిజైనింగ్ నిపుణుడు రాముడు పాల్గొన్నారు.


బస్సును ఢీకొన్న కారు

చంద్రగిరి : తిరుపతి– మదనపల్లె జాతీయ రహదారిపై భాకరాపేట కనుమ వద్ద శుక్రవారం బస్సును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా, డ్రైవర్ సుదర్శన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న బస్సును క్రేన్ సాయంతో తొలగించారు.. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల ఎంపిక

తిరుపతి కల్చరల్: వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన వివిధ నియోజకవర్గాల నేతలను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో వివిధ హోదాలలో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర యూత్ వింగ్ జోనల్ అధ్యక్షుడిగా పుంగనూరు నియోజకవర్గానికి చెందిన పిట్టా హేమంత్‌రెడ్డి, రాష్ట్ర యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా చంద్రగిరికి చెందిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని, రాష్ట్ర యూత్ వింగ్ కార్యదర్శులుగా నగిరికి చెందిన డీ.లోకనాథం, మల్లం రవిచంద్రారెడ్డి(తిరుపతి), ఎస్.కిషోర్(పలమనేరు) నియమితులయ్యారు. అలాగే రాష్ట్ర యూత్ వింగ్ సహాయ కార్యదర్శులుగా భాగ్యరాజ్ ప్రభంజన్ (కుప్పం), చెంగారెడ్డి(పుంగనూరు), కె.శశిధర్‌రెడ్డి(చంద్రగిరి), పి.దొరబాబు(పూతలపట్టు), శిబి చంద్రవర్తి(సత్యవేడు) ఎంపికయ్యారు. రాష్ట్ర వలంటీర్స్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా దిండివరం గణేష్(తిరుపతి), రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా సీఎస్.హరీష్ (పూతలపట్టు) నియమితులైనట్లు పేర్కొంది.

• అలజడి



తూపిలిపాళెం సముద్ర తీరంలో అలల ఉధృతి

వాకాడు: వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటినప్పటికీ అక్కడే కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం కారణంగా శుక్రవారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రంలో అలజడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓ మోస్తారుగా ఉన్న సముద్ర తీరం సాయంత్రానికి ఒక్కసారిగా అలజడి నెలకొంది. దీని కారణంగా తీరంలో అలలు 4 నుంచి 6 మీటర్ల ఎత్తుకు ఎగిసి పడుతున్నాయి. సముద్రం మూడు మీటర్లు ముందుకు వచ్చింది. ప్రస్తుతం వేట విరామం కావడంతో మత్స్యకారులు తమ బోట్లను తాత్కాలికంగా ఒడ్డున నిలిపి కాపలా కాస్తున్నారు.